# డిటెక్టివ్ స్టోరీ

# చెక్!

సూర్యాత్రేయ

"చెక్!" మంత్రిని రెండుగళ్ళు జరిపి, విజయోత్సాహంతో అన్నాడు ప్రకాశరావు.

తన రాజుని దీనంగా, రాజుని చక్రబంధంలో ఇరికించిన ప్రకాశరావు మంత్రినీ, ఏనుగునీ, గుర్రాన్నీ-కసిగా ఒకే క్షణంలో చూసిన దామోదరం బరువుగా నిట్టూర్చాడు. నీరసంగా వెనక్కివాలి, తన వైపు గర్వంగా చూస్తున్న ప్రకాశరావు మొహంలోకి పరాజయభారంతో చూశాడు.

"మీ టెక్నిక్ అర్థం కావడంలేదు! ఓడిపోయినట్టే ఉంటారు! ఠపీమని గెలిచి ఊరుకుంటారు."

"అదేగా, చదరంగంలోని చాతుర్యం!" ప్రకాశరావు సగర్వంగా అన్నాడు. "మరో దరువేద్దామా?"

"ఉండండి...ఎత్తులు వేసి, బుర్ర వేడెక్కిపోయింది. ఓడిపోయిన వాడికింత వేడి కాఫీ పోయించొచ్చుగా..." దామోదరం నవ్వుతూ అన్నాడు.

"అదిగో....సుందరయ్య వచ్చేశాడు. మీరు గ్యారంటీగా ఓడిపోతారనీ, వేడి కాఫీ ఇవ్వాలనీ వాడికి తెలుసుగా!" కాఫీ ట్రేతో వస్తున్న వంటవాడు సుందరయ్యను చూస్తూ అన్నాడు ప్రకాశరావు.

"చందరంగం ప్లేస్‌లో నాతో పేకాట ఆడి ఉంటే-నా ఆస్తీ, వ్యాపారం-సర్వమూ మీ ఖాతాలో జమైపోయుండేదీపాటికి!" కాఫీ చప్పరిస్తూ నవ్వుతూ అన్నాడు దామోదరం.

"ఎందుకంటే పాడు డబ్బు ఎంతని పోగేస్తాం? పరిమితిని దాటిపోయేక డబ్బు కూడా చేదే సుమండీ!"

"కరెక్ట్! నాక్కూడా అలాగే అనిపిస్తూ ఉంటుంది" దామోదరం నవ్వాడు.

ఇద్దరూ స్టేట్‌ఎక్స్‌ప్రెస్ సిగరెట్లు వెలిగించారు.

డోర్ బెల్ మోగింది. వంటతను తలుపు తెరిచాడు.

"ప్రకాశరావు గారికి కొరియర్...." కొరియర్ కుర్రాడు అంటున్నాడు.

వంటతను ఒక చిన్న పార్సెల్‌నీ, కాగితాన్నీ పట్టుకొచ్చి,ప్రకాశరావు ముందు పెట్టాడు. ప్రకాశరావు కళ్ళద్దాలు తగిలించి చూశాడు. 'రెలిష్ కన్‌ఫెక్షనరీ కంపెనీ' నుంచీ వచ్చిందా పార్సెల్. రసీదు మీద సంతకం గీకి, వంటతనికిచ్చి, పార్సెల్ ఓపెన్ చేశాడు ప్రకాశరావు.

అందమైన చాక్లెట్ల డబ్బా. లోపల మడతపెట్టిన కాగితం. కాగితం కింద రకరకాల రంగుల్లో ముచ్చటగా కనిపిస్తున్న చాక్లెట్స్. ప్రకాశరావు కాగితం మడత విప్పాడు. రెలిష్ కన్‌ఫెక్షనరీ కంపెనీ లెటర్ హెడ్ మీద కంపెనీ ఎండీ తనకు రాసిన ఉత్తరాన్ని చదివి, విసుగ్గా టీపాయ్ మీద పడేశాడు.

"చాక్లెట్ గిఫ్టా?" దామోదరం అడిగాడు.

"రెలిష్ కన్‌ఫెక్షనరీ గాడు కొత్తగా 'అమృత్' చాక్లెట్స్‌ని మార్కెట్లోకి వదలబోతున్నాట్టా! మామూలు జనం మీదికి వదిలే ముందు మాలాంటి ప్రముఖులకు రుచి చూపించి, అమూల్యమైన సలహాలు, అభిప్రాయాలూ తీసుకుని, కొత్త రకాన్ని సరికొత్తగా తయారు చేసి, కస్టమర్లను సేవిస్తారట!"

"గుడ్ మార్కెటింగ్ టెక్నిక్!"


"వాళ్లకి గుడ్డే! మనకు వెరీ బ్యాడ్! సుగర్రోగం జుట్టు దాకా ఎగబాకింది. చాక్లెట్స్ తింటే-పాడె కట్టాల్సిందే!" ప్రసాదరావు నవ్వాడు.

"మీరే రుచి చాడాలనెక్కడుంది? మీ శ్రీమతిగారికివ్వండి. ఆవిడ అభిప్రాయం మీదిగా చేసుకుని, 'రెలిష్'కి చెప్పండి!" దామోదరం సూచించాడు.

"మా ఆవిడ పేరేమో 'మధురం' కానీ, తీపి అంటే అసహ్యం ఆమెకి!" ప్రకాశరావు నవ్వుతూ అన్నాడు. "ఒక పని చేయండి. ఆ చాక్లెట్లు మీరూ, మీ ఆవిడా ఆరగించి, ఎలా ఉన్నాయో చెప్పండి. మీ మాట నా మాటగా-కంపెనీ వారికి కన్వే చేస్తా!కొత్త సరుకు రిలీజ్ వేడుకలో ముఖ్యమంత్రితో బాటు వేదిక మీద ఉండమన్నారు, ఆ ఉత్తరంలో."

మూత మూసి, ప్రకాశరావు తన వైపు తోసిన చాక్లెట్ బాక్సుని అందుకున్నాడు దామోదరం. "అన్నట్లు, చాక్లెట్స్ అంటే మా ఆవిడ నాలుక కోసుకుంటుంది. షీ విల్ బి హ్యాపీ!"

దామోదరం మరో ఆట చదరంగం ఆడి, అలవాటు ప్రకారం ప్రకాశరావు చేతిలో ఓడిపోయి, పైకిలేచాడు.



***

దామోదరం హాల్లోకి వచ్చాడు. హాలు మధ్య సోఫాల్లో ఎదురెదురుగా కూచుని, చీట్ల పేక ఆడుతున్న భార్య సిందూరినీ, ఆమె అక్క సీతాలక్ష్మినీ చిరునవ్వుతో చూశాడు.

"షో!" సీతాలక్ష్మి పేక ముక్కలు జాగ్రత్తగా, విసనకర్రల్లా పెడుతూ అంది.

"నాది కార్డు షో! రెండు పాయింట్లేసుకోవే!" సిందూరి పేక ముక్కలు పడేస్తూ అంది.

"ఏమిటి, అప్పుడే దయచేశారు? అయిపోయిందా, మీ చదరంగం?" సిందూరి దగ్గరగా వచ్చిన భర్తను చూస్తూ అంది.

''ఆడీ, ఓడీ...విసుగెత్తేసింది. వచ్చేశాను!'' దామోదరం సోఫాలో కూలబడుతూ అన్నాడు.

''ఆ ఆడేదేదో ఇక్కడే మాతో పేకాట ఆడి ఎంచక్కా ఓడిపోవచ్చుగా, మరిదిగారూ?'' సీతాలక్ష్మి పేకముక్కల్ని కత్తిరేస్తూ అంది.

''ఆడవాళ్ల చేతిలో ఓడిపోవడం అవమానం వదిన గారూ!'' అంటూ చాక్లెట్ డబ్బాని టీపాయ్ మీద పెట్టాడు దామోదరం. ''ఇదిగో... సరికొత్త బ్రాండు చాక్లెట్స్! ఇంకా మార్కెట్లోకి రాలా! ప్రకాశరావుగారు నీకిమ్మని ఇచ్చారు.''

సిందూరి దామోదరం వైపు కళ్లు చిట్లించింది. ''ఏదీ గుర్తుండదా, మీకు? సుగర్రోగం ప్రారంభమైం దని ఆర్నెల్లప్పుడే చెప్పాడుగా, డాక్టరు! ఆ క్షణం నుండీ తీపి ముట్టుకోవడం మానేశాను.''

దామోదరం నాలుకు కరుచుకుంటూ చూశాడు. ఎదురెదురుగా కూచున్న అక్కాచెల్లెళ్ళను చూస్తూ ఉండిపోయాడతను. చెల్లెలు ఎంత లావో అక్క సీతా లక్ష్మి అంత సన్నం! గెడకర్రే! అందుకే భర్తకి ఒక కిడ్నీ దానం చేసినా, ఆవిడ ఆరోగ్యంగానే ఉంది....

''సరే.. పనివాళ్లకిచ్చేస్తాను...'' చాక్లెట్ డబ్బా అందుకోబోతూ అన్నాడు దామోదరం.


సీతాలక్ష్మి పేకముక్కల్ని కలపడం ఆపి, తటాలున చాక్లెట్ డబ్బాని అందుకుంది. ''భలేవారే, మరిది గారూ! చాక్లెట్లంటే నాకు ఇష్టమని, మీకు తెలీదా? ఇంకా నయం! పనివాళ్లకిస్తార్ట!''

''అక్కయ్య తింటుందిలెండి!'' సిందూరి అందుకుంటూ అంది.

''తిని, ఎలా ఉన్నాయో చెప్పండొదినగారూ, ప్రకాశ రావుగారికి చెప్పాలి. ఆయన చాక్లెట్ కంపెనీ వాళ్లకి చెప్పాలి!'' దామోదరం సోఫాలో వెనక్కి వాలాడు.

సీతాలక్ష్మి డబ్బా తెరిచి, ఒక చాక్లెట్ తీసి, కాగితాన్ని వొలిచి, నోట్లో దోపుకుంది. ముఖం చిట్లిస్తూ, దామోదరం వైపు చూసింది. ''కోక్ మిక్సా? వగ రుగా, ఘాటుగా-అదోలా ఉంది?''

''ఏమ్మిక్సింగో ఎవరికి తెలుసు? పేరు 'అమృతం' అని మాత్రమే తెలుసు. ఏదీ... నేనూ రుచిచూస్తాను!'' అంటూ చెయ్యి చాచాడు దామోదరం.





# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## తాళం చెవి

ఒకనాడు, ఒంటరిగా నడిచివెళుతున్న డిటెక్టివ్‌కు ఓ యింటి గుమ్మం ముందు నిలుచున్న వృద్ధుడు కనిపించాడు. అంతలోనే రివాల్వర్ పేలిన శబ్దమైంది. వృద్ధుడు నేల కొరిగాడు. పక్కింటి వాళ్లు వచ్చి అతడికి ఫస్ట్‌ఎయిడ్ చెయ్యబోయారు గాని అప్పటికే అతడు మరణించాడు. దూరంగా నిల్చుని యింటి వైపు చూస్తున్న యువకుడే హంతకుడై వుంటాడనుకున్నాడు డిటెక్టివ్. పోలీసుల సహాయంతో అతణ్ణి పట్టుకుని యింటరాగేషన్ ప్రారంభించాడు.

"నా దగ్గిర గన్ లేదు. నేను కాల్చలేదు. ఆ వృద్ధుడు అతి ప్రయత్నం మీద యింటికి తాళం వేయటానికి ప్రయత్నిస్తుంటే చూస్తూ నిల్చున్నానంతే" అన్నాడు యువకుడు అమాయకంగా.

మృతుడి యింట్లో అతని భార్య ఒక్కతే వుంటోంది. ఆమె జబ్బు మనిషి మోకాళ్ల నొప్పుల్తో మంచం కూడా దిగలేదు. భర్త మందులు కొనుక్కురావటానికి బయల్దేరాడట. అయితే, భార్య కదల్లేదు గనక, వెళ్లిన ప్రతిసారీ యింటికి తాళం వెయ్యటం అతడి కలవాటు.

"సందేహం లేదు. యువకుడే హత్య చేశాడు" అన్నాడు డిటెక్టివ్.

ఏ ఆధారాలతో ఆ నిర్ణయానికి వచ్చాడు డిటెక్టివ్?

సమాధానం: తాళం చెవి పట్టుకున్న మనిషిని చూసినంత మాత్రాన అతడు తాళం తీస్తున్నాడో, వేస్తున్నాడో ఎలా తెలుస్తుంది? అంటే, ఆ యువకుడు, కొన్నాళ్లుగా ఆ వృద్ధుడి కదలికల్ని రాకపోకల్ని గమనిస్తున్నాడన్న మాటే గద.

సీతాలక్ష్మి ఒక చాక్లెట్‌ని అతని వైపు విసిరింది. పట్టుకుని పేపర్ ఒలిచి, నోట్లో వేసుకుని చప్పరించాడు దామోదరం. అతని ముఖం వంకర్లు పోయింది. "వీడి అమృతం కాలా... ఇంత ఘాటుగా ఉందేమిటి?"

"వగరూ, ఘాటూ ఉన్నా, తీపి కూడా అందు తోంది నాలిక్కి. మరిదిగారూ... ఉగాది పచ్చడి ఇన్‌స్పిరేషన్‌తో తయారు చేసినట్టున్నారు." సీతాలక్ష్మి నవ్వుతూ అంది. "నాలిక మందగించినట్టనిపిస్తోంది గానీ, ఇదో కొత్త రుచి!"

సీతాలక్ష్మి మరో చాక్లెట్‌ని నోట్లో దోపుకుంది.

దామోదరం చాక్లెట్‌ని చప్పరిస్తూ, పైకి లేచాడు. "అబ్బే....నాకు నచ్చలేదు... సిందూరీ.... ఫ్యాక్టరీకెళ్లి, వస్తాను!"

"నువ్వే పంచాలి!" సిందూరి సీతాలక్ష్మితో అంది.

"ఏమిటో... ఒకటి, రెండూ చాక్లెట్లు వగరుగా, ఘాటుగా అనిపించాయి గానీ...ఆ తరువాత నాలుక మొద్దుబారిపోయినట్లుంది. రుచి తెలియడం లేదు!" అంటూ సీతాలక్ష్మి సోఫాలో వెనక్కివాలి ముఖం మీద పట్టిన చెమటను తుడుచుకుంది....

***

"ఫ్యాక్టరీ!" కార్లో కూచుంటూ, డ్రైవర్‌కి ఉత్తర్వులిచ్చాడు దామోదరం.

కారు కదిలింది. గేటు దాటి, రోడ్డు మీదికి చేరుకుంది. నాలుక మీద చాక్లెట్ రుచి అదోలా అనిపిస్తోంది దామోదరానికి. ఆల్కహాల్ గానీ, డ్రగ్స్ కానీ కలిపారా, తక్కువ మోతాదులో కొంపదీసి? ఈ కంపెనీల్ని నమ్మడానికి లేదు! అలవాటు చేసి, ప్రొడక్ట్‌కి బానిసలుగా మార్చడానికి ఎంత దారుణమైనా చేస్తారు. మందంగా తయారవుతున్న నాలుకను చప్పరిస్తూ, నుదురుమీద ఉబుకుతున్న స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ వెనక్కివాలాడు దామోదరం. కారు రోడ్డు మీద దూసుకెళ్తోంది.

***

"ఏమిటక్కయ్యా.... నువ్వే... ముక్క వెయ్యి!" ఆటలో స్పీడు తగ్గితే సహించలేని సిందూరి అంది.

సీతాలక్ష్మి కుడిచేతి వేళ్లు పేకముక్కని లాగి, టీపాయ్ మీదికి పడేశాయి.

"ఏమిటే.... రెండు ముక్కలేశావ్?" జంటగా పడిన రెండు ముక్కల్ని చూస్తూ అంది సిందూరి. మెల్లగా రెప్పలెత్తి అక్కయ్య వైపు చూసింది.

"నీ...నీ...ళ్లు..." నత్తి నత్తిగా అంటున్న సీతాలక్ష్మిని ఆశ్చర్యంగా చూస్తూ పేకముక్కల్ని పడేసింది సిందూరి.

"అక్కయ్య... ఏమిటే... ఏమిటే అలా ఉన్నావ్?"

సీతాలక్ష్మి నీరసంగా తలెత్తి చెల్లి ముఖంలోకి చూసింది. ఎందుకో ఆమె నాలుక పెదవుల సందు లోంచీ బైటికి సాగుతూ, మళ్లీ లోపలికి వెళ్తూ, కదుల్తోంది. ముఖం చెమటతో పూర్తిగా తడిసిపోయింది. కళ్లల్లో ఏదో విపరీతమైన భయం తొంగి చూస్తోంది. అప్పటిదాకా ఆమె ఎడమ చేతిలో విసనకర్రలా విచ్చుకుని ఉన్న పేకముక్కలు ఒకదాని వెంట ఒకటిగా నేల మీదికి రాల్తున్నాయి.

"అక్కయ్యా! ఏమైందే?" సిందూరి కంగారుగా అరిచింది.

చెల్లెలి ప్రశ్నకు జవాబుగా, సీతాలక్ష్మి టీపాయ్ మీదికి బోర్లాపడిపోయింది. బిగుసుకుపోయినట్టున్న ఆమె ముఖాన్ని చూసి, సిందూరి ఛార్జింగ్‌లో పెట్టిన సెల్‌ఫోన్ వైపు పరుగెట్టింది.

***

సీతాలక్ష్మిని పరీక్షించిన డాక్టర్ వామనరావు, ఆమె కనుగుడ్లని మరోసారి చూసి, ముక్కు కింద వేలు ఉంచి చూసి, పైకి లేచి, సిందూరి వైపు చూశాడు. "అయామ్ సారీ... ప్రాణం పోయింది..."

సిందూరి కళ్లు గిన్నెల్లా అయ్యాయి. ఆమె ఎడమ చెయ్యి ఛాతి మీద ఆనింది. ఆమె భారీ శరీరం వణకసాగింది. మరుక్షణం ఆమె సోఫాలో కూలబడింది.

డాక్టర్ వామనరావు కంగారుగా పక్కన కూచుని, ఆమె నాడిని పరీక్షించాడు. టీపాయ్ మీదున్న గ్లాసు లోని నీళ్లతో వేళ్లు పెట్టి ఆమె నుదుర్ని తుడిచాడు.

"సిందూరి గారూ, టేకిటీజీ... ఇదిగో నీళ్లు తాగండి!"

డాక్టర్ సపర్యతో సిందూరి రెండు నిమిషాల్లో కోలుకుంది. ఆమె కళ్లల్లోంచి జారుతున్న కన్నీటిని చూస్తూ డాక్టర్ ధైర్యంగా నిట్టూర్చాడు.

"డాక్టర్ గారూ...అక్కయ్యను మంచం మీద పడుకోబెడతారా..." సిందూరి ఏడుపు ఆపుకుంటూ అంది.

"వద్దు! పోలీసులు వచ్చేదాకా ఆగాలి! మీ అక్కగారిది సహజమరణం కాదు.... విష ప్రభావం ఆమె ప్రాణం తీసింది. పోలీసులకి రిపోర్ట్ చేస్తాను...." అంటూ డాక్టర్ వామనరావు జేబులోంచి మొబైల్ తీశాడు....

***

నిలువెత్తు అద్దం ముందు నిలబడి, పొడవుగా, ఠీవిగా అవుపిస్తున్న తన ప్రతిబింబాన్ని ఎగాదిగా చూశాడతను. వంకీలు తిరిగిన క్రాపు, వెడల్పాటి నుదురు, తెలివితేటల్ని వెదజల్లే కళ్లు, అందంగా ఆరోగ్యంగా మెరుస్తున్న ముఖం. క్రీమ్‌కలర్ ప్యాంటు మీద వైట్ కలర్ టీ షర్టు. ఆ షర్టు చేతుల్ని మోచేతుల్దాకా, విలాసంగా ఎగదోశాడతను. రెండు చేతుల్నీ ప్యాంటు జేబుల్లోకి దోపి, అద్దంలోకి చూస్తూ ఉండిపోయాడు. ప్రతిబింబం తనని చిరునవ్వుతో చూస్తోంది. అందమూ, ఠీవి కలిపి పోతపోసిన విగ్రహం! అమ్మ తన అందాన్నీ, నాన్న హుందానీ బహుమతిగా ఇచ్చారు తనకు పుట్టినప్పుడు..

రింగ్‌టోన్ వినిపిస్తున్న మొబైల్‌ని ప్యాంటు జేబులోంచి లాక్కొచ్చింది అతని చెయ్యి.

"డిటెక్టివ్ ప్రాణ్ స్పీకింగ్!" అన్నాడతను అద్దం మీంచీ చూపుల్ని తిప్పకుండా.

"భయ్యా! ఇన్‌స్పెక్టర్ అరవింద్!" అవతలి కంఠం అంది. "ఇప్పుడే అందిన దుర్వార్త! ఇండస్ట్రియలిస్ట్ దామోదరం తెలుసుగా! ఆయన వదినగారూ–అన్న భార్యకాదు, భార్య అక్కగారు– విషంతో చనిపోయింది. డాక్టర్ వామన్‌రావు ఫోన్ చేశాడు. దూసుకొస్తున్నా: గేటు ముందు..."

"నిలబడతా!" డిటెక్టివ్ ప్రాణ్ అడ్డు తగిలి, సెల్‌ని ఆఫ్ చేశాడు.

***

టీపాయ్ మీద బోర్లా పడిన శవాన్నీ, శవం ముఖం దగ్గరగా ఉన్న చాక్లెట్ బాక్స్‌నీ కాసేపు చూసి, డిటెక్టివ్ ప్రాణ్, డాక్టర్ వామన్‌రావు వైపు తిరిగాడు.

"డాక్టర్‌గారూ...చాక్లెట్ పాయిజనింగా?"

"అంతే అనుకోవాలి. పోస్ట్‌మార్టం జరిగాక ఖచ్చితంగా తెలుస్తుంది.. లక్షణాలు విషాన్నే సూచిస్తున్నాయి."

పోలీసు ఫోటోగ్రాఫరూ, ఫింగర్ ప్రింట్సుతనూ తమ పనులు యాంత్రికంగా చేసుకుపోతున్నారు. ఇన్‌స్పెక్టర్ అరవింద్ పర్యవేక్షిస్తున్నాడు. డిటెక్టివ్ ప్రాణ్ అతని వైపు అడుగులేశాడు. అరవింద్ ప్రాణ్

వైపు తిరిగి, ఏదో అడగబోయాడు. పిడికిట్లో ఉన్న అతని మొబైల్ రాగం తీసింది.

"ఇన్‌స్పెక్టర్ అరవింద్ హియర్!" అంటూ అరవింద్ కాసేపు విని.. "చెప్పండి!" అన్నాడు. ఇన్‌స్పెక్టర్ చెవి రిక్కించుకొని వింటోంది. కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకుంటున్నాయి. వింటూ, ప్రాణ్ భుజం మీద చెయ్యి వేసి, సోఫాల వైపు నడిచాడతను. మొబైల్ బటన్ నొక్కి, సిందూరి వైపు చూశాడు.

"మేడమ్, 'ట్రీట్‌వెల్' హాస్పిటల్ నుంచీ డాక్టర్ శివరాజ్ ఫోన్ చేశారు. దామోదరంగార్ని డ్రైవర్ హాస్పిటల్లో చేర్చాడు. ఫుడ్ పాయిజనింగ్...."

"అయ్యో దేవుడా.... ఏమిటీ అన్యాయం!" సిందూరి ఏడుపు ప్రారంభించి, బలవంతాన ఆపుకుంది. "అక్కయ్యను చూస్తూ, ఆయన విషయం మరిచిపోయాను. ఆయన కూడా చాక్లెట్ తిన్నారు... భగవంతుడా..."

"మేడమ్ కంగారు పడకండి! మీ వారు క్షేమంగా ఉన్నారు. ప్రాణాపాయం లేదు. ఇన్‌టెన్సివ్‌కేర్‌లో ఉన్నారు. రండి. మిమ్మల్ని తీసుకెళ్తాను!" అన్నాడు ధైర్యం చెప్తూ, ఇన్‌స్పెక్టర్.

"నువ్వెళ్లు.... ఇక్కడ నేను చూసుకుంటాను!" డిటెక్టివ్ ప్రాణ్ అన్నాడు.

***

"అయామ్ డిటెక్టివ్ ప్రాణ్....."

"రండి..." గుమ్మం ముందు ప్రత్యక్షమైన యువకుణ్ణి చూస్తూ అన్నాడు ప్రకాశరావు. "మీరొస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అరవింద్ ఫోన్ చేశారు."

"ప్రకాశరావుగారూ.... మీరు తినాల్సిన చాక్లెట్లు దామోదరంగారూ, ఆయన వదినగారూ.... ఆరగించారు...." అంటూ ఆగాడు ప్రాణ్.

"అది నా అదృష్టం, వాళ్ల దురదృష్టం...నా మధుమేహం నన్ను కాపాడింది..." ప్రకాశరావు విచారంగా అన్నాడు. 'రెలిష్ కన్‌ఫెక్షనరీ కంపెనీవాళ్లు త్వరలో లాంచ్ చేయబోయే కొత్త ప్రొడక్ట్-చాక్లెట్స్ నాకు పంపించారు. రుచి చూసి అభిప్రాయం చెప్పమంటూ ఉత్తరం కూడా రాశారు. పార్సెల్ వచ్చే సమయానికి దామోదరం ఉన్నాడు ఇక్కడే! మా ఆవిడకి స్వీట్స్ నచ్చవన్నాను. తన భార్యకి చాలా ఇష్టం అన్నాడు. పట్టుకెళ్లి ఆమెకి ఇవ్వమన్నాను..."

"రెలిష్ వాళ్లు కొత్త చాక్లెట్స్ లాంచ్ చేసిన ప్రతీసారీ మీకు పంపుతూ ఉంటారా?"

"నెవర్! ఇదే మొదటి సారి! చెప్పాలంటే, ఆ కంపెనీతో నాకు పరిచయమే లేదు!" ప్రకాశరావు అన్నాడు. కూల్‌డ్రింక్స్‌లో పెస్టిసైడ్స్‌లాగా, ఈ చాక్లెట్స్‌లో కూడా ఏ కాలకూటాలు కలుపుతున్నారో! ప్రభుత్వం కళ్లు తెరవాలి! చిన్నపిల్లల తినుబండారాలు కదా!"

"రెలిష్ కన్‌ఫెక్షనరీస్ మీకు రాసిన ఉత్తరం ఉందా?" డిటెక్టివ్ ప్రాణ్ అడిగాడు.

"ఉంది...జరిగింది తెలియగానే, పార్సెల్ పేపర్నీ జాగ్రత్త చేశాను. ఇమ్మంటారా?"

"ప్లీజ్...."

## 4

"అరవింద్, పోస్ట్‌మార్టం రిపోర్ట్ ఏమంటోంది?" డిటెక్టివ్ ప్రాణ్ అడిగాడు.

"విషం మూలంగా సీతాలక్ష్మి మరణించింది. చాక్లెట్ల లోంచీ వచ్చింది విషం. రెలిష్ కంపెనీ వాళ్లు తగినంత జాగ్రత్తగా లేరని అర్థమవుతోంది. హత్యా నేరం కంపెనీమీదే మోపితే సరి!" ఇన్‌స్పెక్టర్ అరవింద్ అన్నాడు.

"ఇక్కడే కాదు, ఇండియాలో ఎక్కడా 'రెలిష్ కన్‌ఫెక్షనరీస్' అనే కంపెనీయే లేదు" డిటెక్టివ్ ప్రాణ్ తాపీగా అన్నాడు. "పార్సెల్ మీదున్న ఫ్రం అడ్రస్ బోగస్‌ది!"

"వాట్?"

"ఎస్. సందేహానికి తావు లేకుండా నిర్ధారించుకున్నాను. ఎవడో లేని కంపెనీ పేరుతో విషం నిండిన చాక్లెట్స్ సప్లయ్ చేశారు..." ప్రాణ్ అన్నాడు. "తనకు తెలిసీ, శత్రువులే లేరంటున్నాడు ప్రకాశరావుగారు. అజ్ఞాత శత్రువు ఎవడో ఉన్నాడన్న భయం పట్టుకుంది ఇప్పుడాయనను!"

"కొరియర్ కంపెనీలో వాకబుచేయిస్తా... పార్సిల్ ఎవరు బుక్ చేశారో తెలుస్తుంది!" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"వాకబు చేశాను. 'కార్నర్ టు కార్నర్' కొరియర్ సర్వీస్ అది. వాళ్లు చెప్పలేమన్నారు. ఒకసారి నెమరు వేసుకుంటే..ప్రకాశరావుకి ఎవరో చాక్లెట్స్ పంపారు. ఆయన దామోదరం గారికి ఇచ్చారు. ఆయన వదిన గారికి ఇచ్చారు. ఆమె తిని, చనిపోయింది. దామోదరం గారు చచ్చి బతికారు....చాక్లెట్లలోని ఎక్కువ విషం సీతాలక్ష్మికి ప్రాణాంతకమైంది. తక్కువ మోతాదు దామోదరాన్ని చంపలేకపోయింది.... ఇవీ, ఈ కేసులోని మెయిన్ ఈవెంట్స్!" పచార్లు ప్రారంభించిన ప్రాణ్ తన ఆలోచనలకి రూపం ఇచ్చాడు.

"ఎస్, క్రమం అదే!" ఇన్‌స్పెక్టర్ అరవింద్ అనకుండా ఉండలేకపోయాడు.

"ఆ క్రమంలో అక్రమం జరిగింది. ఎవరి వల్ల జరిగిందో, ఎందుకు జరిగిందో తలాతోకా తెలియడం లేదు" ప్రాణ్ విసుగ్గా మరో సిగరెట్ వెలిగించాడు కుర్చీలో కూచుంటూ.

"ఎవరి వల్ల జరిగినా, ప్రకాశరావుగారు బతికిపోయాడు. దామోదరంగారి వదిన బలైపోయింది!" ఇన్‌స్పెక్టర్ అన్నాడు. "ట్విస్ట్ ఆఫ్ ఫేట్!"

డిటెక్టివ్ ప్రాణ్ క్షణం పాటు ఇన్‌స్పెక్టర్ అరవింద్ వైపు చూస్తూ ఉండిపోయాడు. సగం కాలని సిగరెట్‌ని గది మూలకి గిరాటేసి, తటాలున లేచి నిలబడ్డాడు. "అరవింద్,, ఒకచోటికి వెళ్లొస్తాను!"

"ఎక్కడికి?"

"ఎక్కడికేనా వెళ్లేటప్పుడు 'ఎక్కడికి?' అని అడగకూడదు!" అంటూ అరవింద్‌కి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చరచరా బైటికి నడిచాడు డిటెక్టివ్ ప్రాణ్....

***

"ఆ పాడు చాక్లెట్ల రహస్యం తెలిసిందా, నాయనా?" ఎదురుగా కూచున్న డిటెక్టివ్ ప్రాణ్‌ని చూస్తూ అడిగింది సిందూరి.

"త్వరలో తెలుసుకుంటాం! మీవారెలా ఉన్నారు? పలకరించిపోదామని వచ్చాను... పడుకున్నారా?" ప్రాణ్ అడిగాడు.

"లేదు నాయనా! అక్కయ్య అస్థికల్ని గోదావరిలో నిమజ్జనం చేయడానికి రాజమండ్రి వెళ్లారు. రేపుదయానికల్లా ఇక్కడుంటారు. బాగా నీరసించిపోయారు. అంతా నా దురదృష్టం...." సిందూరి బరువుగా నిట్టూర్చింది.

డిటెక్టివ్ ప్రాణ్ చిరునవ్వు నవ్వాడు. "మీది అదృష్టం! అందుకే ఆ చాక్లెట్లు ముట్టుకోలేదు మీరు!"

"ఎలా ముట్టుకుంటాన్నాయనా! ఆర్నెల్లబట్టీ షుగర్ కాపరం చేస్తోంది ఒంట్లో! నేను తిననని తెలుసు కదా? అనవసరంగా తీసుకొచ్చారు ఆ దిక్కుమాలిన చాక్లెట్లని! అక్కయ్య కోసం ఆ యమధర్మరాజే పంపిచాడనిపిస్తోంది!"

"అలా అనుకోవడమే మన పని!"అంటూ డిటెక్టివ్ ప్రాణ్ శబ్దం చేస్తున్న మొబైల్‌ని జేబులోంచి తీసి, నంబరు చూస్తూ కాసేపు ఉండిపోయాడు. కట్ చేసి, సిందూరి వైపు చూశాడు. "మీ అక్కయ్యగారి గురించి చెప్పండి!"

సిందూరి చెప్పడం ప్రారంభించింది. ప్రాణ్ వంట మనిషి ఇచ్చిన కాఫీ తాగుతూ వినసాగేడు.

***

బంగళా లోంచి అవతలకి వచ్చి, తన కారు వైపు నడవసాగేడు ప్రాణ్. "సార్!" అంటూ ఎవరో పిల



### పెళ్లి చేసుకోబోతున్న నయనతార?

పలు ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకుని తలమునకలవుతున్న నయనతార తన 'చిలిపిచేష్టల'కు ఫుల్‌స్టాప్ పెట్టేసి బుద్ధిగా పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు సినీ పరిశ్రమలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకూ తన గ్లామర్‌తోనూ, రకరకాల కాస్ట్యూమ్స్‌తోను అభిమానులకు కనువిందు చేసిన నయనతార తన తాజా చిత్రం (జూనియర్ ఎన్టీఆర్‌తో చేస్తున్న సినిమా)లో గ్లామర్ దుస్తులు వేసుకోనని మొండికేసిందని సమాచారం. ఇద్దరు హీరోయిన్లు గల ఈ సినిమాలో గ్లామర్‌కే పెద్దపీట. మరి అలాంటిది నయనతార ఇప్పుడు ఈ మెలిక పెట్టడంతో దర్శక, నిర్మాతలు లబోదిబోమంటున్నారట! నయనతార పెళ్లి చేసుకొని జీవితంలో సెటిల్ అవ్వాలని నిర్ణయానికి వచ్చిన తరువాతే ఈ విధంగా ప్రవర్తిస్తోందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అదీ సంగతి!

వడం విని, ఆగి తిరిగి చూశాడు. యూనిఫామ్‌లో ఉన్న డ్రైవరు దగ్గరగా వచ్చి నమస్కారం చేశాడు.

"విషం చాక్లెట్ల గురించి ఏదైనా తెలిసిందా, సార్?"

"లేదు...నీ పేరు?" ప్రాణ్ అడిగాడు.

"సోము, సార్."

"అమ్మగారూ, డాక్టర్లు–అందరూ నిన్ను మెచ్చుకున్నారు సోమూ! సమయం మించిపోకుండా మీ అయ్యగార్ని హాస్పిటల్‌కి చేర్చావు!"

"ఆ దేముడి దయ సార్! మామూలుగా వెనక సీట్లో కూచునే అయ్యగారు ఆ రోజు ముందు సీట్లో నా పక్కనే కూచున్నారు. మెయిన్ రోడ్ మీద వెళ్లమన్నారు. ఉన్నట్టుండి తూలిపడిపోయారు, చెమటలు కక్కుతూ. సిగ్నల్స్‌ని కూడా లెక్కచేయకుండా, ఆస్పత్రికి దూసుకెళ్లాను!" సోము వినయంగా అన్నాడు.

"సమయస్ఫూర్తి అంటే అదే, సోమూ! డ్రైవర్‌కి ఆ గుణం ముఖ్యం!వస్తా!" అంటూ డిటెక్టివ్ ప్రాణ్ కారు వైపు వెళ్లాడు.

***

ఆఫీసులో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న ఇన్‌స్పెక్టర్ అరవింద్ లోపలికొస్తున్న డిటెక్టివ్ ప్రాణ్‌ని చూస్తూ, ఠపీమని ఆగాడు. "థ్యాంక్ గాడ్! వచ్చావ్!"

"వచ్చింది నేనూ, గాడ్ కాదు! ఆ థాంక్సేవో నాకు చెప్పుకో!" డిటెక్టివ్ ప్రాణ్ నవ్వుతూ అన్నాడు.

"ఎక్కడికెళ్లావ్? ఏమైపోయావ్? ఇరవైనాలుగ్గంటలు! ఫోన్ స్విచ్ఛాఫ్ చేశావ్! ఏమిటి కథ?" అరవింద్ ప్రశ్నలు బాణాల్లా ప్రాణ్ వైపు దూసుకెళ్లాయి.

"చెప్తాను. ముందు కూర్చో. అలా శాంతంగా కూచో!" అంటూ ప్రాణ్ కుర్చీలో కూచున్నాడు. "చాలా బిజీగా ఉండిపోయాను. ఈ ఇరవై నాలుగ్గంటల్లో మూడు చోట్లకి వెళ్లాను. నాలుగు విషయాలు తెలుసుకున్నాను. పాయిజన్డ్ చాక్లెట్స్ ప్రకాశరావుకి ఎవరు పంపించారో కనిపెట్టాను..."

"ఈజిట్? నిజంగా?" ఇన్‌స్పెక్టర్ అరవింద్ అరిచాడు. ఆశ్చర్యంగా. "ఎవడు? ఎవడు వాడు?"

"ఎందుకా తొందర? బజార్లో దొరికే నాసిరకం చాక్లెట్లకు 'నైట్రోబెంజైన్' పదను పెట్టాడు..."

"తెలుసు... మా లాబ్ నిపుణులు ఎనాలసిస్ చేసి చెప్పారు!" ఇన్‌స్పెక్టర్ అరవింద్ అడ్డొస్తూ అన్నాడు. 'నైట్రిక్ యాసిడ్' నీ 'బెంజాల్' చక్కగా రంగరించి, ఆ 'నైట్రోబెంజైన్' తయారు చేశారు!"

"పాయిజన్డ్ చాక్లెట్స్‌ని కొరియర్ ద్వారా ప్రకాశరావుకి పంపించాడు, లేని కంపెనీపేరుతో! అలా పంపడంలో తన తెలివిని అద్భుతంగా ఉపయోగించాడు.."

"ఎవరు?"

"హంతకుడు."

"ఎవరు?"

"చెప్తాను, నువ్వు నమ్మవు!"

"ప్లీజ్ ప్రాణ్!"

"అతను...దామోదరం...."

"వాట్?!" అరవింద్ గావుకేక లెవల్లో అరిచాడు. "ఐ కాంట్ బిలీవ్!"

"వివరాలు విను, విశ్వాసం కలుగుతుంది!" డిటెక్టివ్ ప్రాణ్ నవ్వుతూ అన్నాడు.

"దామోదరం కొన్ని 'ఎక్స్‌ట్రాలు' చేశాడు. అవి నా అనుమానాన్ని అతని మీదికి మళ్లించాయి. ఒకటి అతని భార్య డయాబెటిక్ అని తెలిసీ, ఆమె చాక్లెట్లు ముట్టుకోదని తెలిసీ, ఆమెకు 'చాక్లెట్లంటే ప్రాణం' అంటూ ప్రకాశరావుగారికి 'లీడ్' ఇచ్చాడు! రెండు: ప్రకాశరావుగా నటిస్తూ, కొరియర్ కంపెనీకి ఫోన్ చేశాడు. తనకో పార్శిల్ వస్తుందనీ సరిగ్గా పదకొండు గంటలప్పుడు ఇంట్లో ఉంటానని, ఆ సమయంలో పంపించమనీ చెప్పాడు. అది ప్రకాశరావుతో తాను చెస్ ఆడే సమయం. ప్రకాశరావు కొరియర్‌కి ఫోన్ చేయలేదు. మూడు: కారెక్కే యజమాని, సాధారణంగా డ్రైవర్ పక్కన, ముందు సీట్లో కూచోడు! అయితే, తాను ఒక చాక్లెట్ తిన్నాక, ఫ్యాక్టరీకి వెళుతున్నట్టు చెప్పి, కారెక్కి, ముందుసీట్లో కూచున్నాడు. ఎందుకు? చాక్లెట్లోని విషప్రభావం తనని స్పృహ కోల్పోయేలా చేస్తుంది. ఎమర్జన్సీ వైద్యం అవసరం! పక్కనుంటే డ్రైవర్ తన స్థితిని గ్రహిస్తాడు! వెనక సీట్లో, కూచుంటే, డ్రైవర్ చూడకపోవచ్చు! అది ప్రమాదం! నాలుగు:మామూలుగా వెళ్లే బైపాస్ రోడ్డమ్మట కాకుండా, మెయిన్ రోడ్డు మీద వెళ్లమన్నాడు డ్రైవర్ని! ఎందుకు? ట్రీట్‌వెల్ హాస్పిటల్ మెయిన్ రోడ్డులోనే ఉంది! ఇవన్నీ దామోదరం అతి తెలివితో చేసిన ఎక్స్‌ట్రాలు! అతను ఇంకో పొరపాటు కూడా చేశాడు. చాక్లెట్స్‌తో పాటు పంపిన ఉత్తరాన్నీ, పార్శిల్ పేపర్ని ప్రకాశరావు వద్దే మరిచిపోయాడు!"

"గురూ! బుర్ర తిరిగిపోతోంది! దామోదరం చాక్లెట్స్‌కి విషం కోటింగ్ ఇచ్చాడు. లేని కంపెనీ పేరుతో ప్రకాశరావుకి పంపించాడు. ఆయన్నుంచీ తీసుకున్నాడు. సీతాలక్ష్మికి ఇచ్చాడు... ఓకే... ఎందుకు?"

"సీతాలక్ష్మిని పంచభూతాల్లో కలిపివేయడానికి!"

"ఎందుకు?"

"ఇప్పుడు నీకు సీతాలక్ష్మి కథ చెప్పాలి!" డిటెక్టివ్ ప్రాణ్ నవ్వుతూ అన్నాడు. "ఆ కథ నాకు సిందూరిగారు చెప్పారు. సీతాలక్ష్మి భర్త చిన్న వయసులోనే చనిపోయాడు. ఆమెకి పిల్లలు లేరు. బోలెడంత ఆస్తి. తన అనంతరం తన యావదాస్తీ చెల్లెలు సిందూరికి చెందేలా, ఆవిడ వీలునామా రాసింది. ఆమె పోతే, ఆమె ఆస్తి, తన భార్యకు, అంటే తన గుప్పిట్లోకి వస్తుంది.

"మైగాడ్! ఆ దరిద్రుడు కోటీశ్వరుడుగా గురూ!"

"ఆ దరిద్రుడు, ఇప్పుడు కోటీశ్వరుడు కాదు. కోట్ల అప్పులకు ఈశ్వరుడు! పూర్తిగా మునిగే పరిస్థితి. అతని ఆడిటర్ కుమార్ నా మిత్రుడు. అతన్నుంచీ రాబట్టాను!"

"ఇంకో సందేహం..." ఇన్‌స్పెక్టర్ అరవింద్ అన్నాడు. "సీతాలక్ష్మికి ఇచ్చాడు. సరే! తానెందుకు తిన్నాడు? విషం చాక్లెట్ ప్రాణాంతకం కదా?"

"అతను జాగ్రత్తగా, ఒక్కటే ఒక్కటి చప్పరించాడు. ప్రాణం తీసేంత డోస్ కాదని అతనికి తెలుసు! తన మీద అనుమానం రాకుండా ఉండడానికి, తను కూడా చాక్లెట్ విక్టిమే అని అందరూ సానుభూతితో అనుకోవడానికి ఆ చిన్న రిస్క్ తీసుకున్నాడు" డిటెక్టివ్ ప్రాణ్ వివరించాడు. "తన మీద అనుమానం రాకుండా ఉండడానికీ, పోలీసుల్ని పక్కదారి పట్టించడానికీ చాక్లెట్స్‌ని తెలివిగా తన మిత్రుడు ప్రకాశరావుకి పంపించాడు."

"పొరపాటున ప్రకాశరావు వాటిని తిని ఉంటే?" ఇన్‌స్పెక్టర్ అరవింద్ సందేహం వ్యక్తం చేశాడు.

"ప్రకాశరావు గారికి వీర మధుమేహం అనీ, చాక్లెట్స్‌ని చేత్తో కూడా తాకడనీ దామోదరానికి ఖచ్చితంగా తెలుసు! ఒకవేళ జిహ్వాచాపల్యంతో ఒకటి చప్పరించే ప్రయత్నం చేస్తే- ప్రకాశరావుని వారించడానికి తను పక్కనే రెడీగా ఉన్నాడుగా!"

"మొత్తం మీద దామోదరం మనల్ని రాంగ్ రూట్‌లో పంపించే తెలివితో తప్పులు చేశాడు!" ఇన్‌స్పెక్టర్ అరవింద్ నవ్వాడు.

"అదే అతని 'రాంగ్‌మూవ్'! అందుకే మనం 'చెక్' పెట్టేశాం!" డిటెక్టివ్ ప్రాణ్ సగర్వంగా అన్నాడు. "గోదార్లో పుణ్యస్నానం చేసి,పరిశుద్ధుడై రేపుదయం ఇంటికొస్తున్నాడు దామోదరం...వెళ్లి కరకంణాలతో స్వాగతం చెప్పు!"

"నీకు శతకోటి–ఊహూ–సహస్రకోటి ధన్యవాదాలు, ప్రాణ్!" ఇన్‌స్పెక్టర్ అరవింద్ ఉత్సాహంగా అన్నాడు.

"నోటితో కాదు, కాఫీతో చెప్పు, ఇన్‌స్పెక్టర్!" డిటెక్టివ్ ప్రాణ్ నవ్వుతూ అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ అరవింద్ నవ్వుతూ కాలింగ్ బెల్ నొక్కాడు.

✱

